



# ★ "పొరపాటు" ★

... రచయిత్రి : సరోజ ...

"పూలన్నీ నాకే పెట్టాలి" అంది రెండు జడల తలని ఊపుతూ రేణుక !

"మాకేం అక్కర్లేదేంటి?" అంది తనూ చిన్నపిల్లలా, మల్లెలు కడుతున్న హేమ"

"ఫో అమ్మా! నువ్వు మంచిదానివి కాదు" అంది చెట్లకు నీళ్ళుపోస్తున్న పెత్తల్లి సుశీల దగ్గరకు పరుగెడుతూ.

"నే చెబుతా రామ్మా అమ్మకి" అంటూ రేణుకను ఎత్తుకుని వచ్చిన అక్కని చురచుర చూసింది హేమ.

"ఎన్నిసార్లు చెప్పానే అక్కా నీకు దాన్నలా నెత్తికెక్కించుకోవద్దని"

"చిన్నపిల్ల దానికికాక మనకాపూలు చెప్పు" ప్రాథేయపడుతూ అంది సుశీల పూలు రేణుకకి పెడుతూ.

"అదుగో! అదే వద్దన్నాను, నా మాటకి విలువలేకుండా చెయ్యడమే నీపని. నువ్విలా చేస్తావు కనుక, అది నా మాటంటె నిర్లక్ష్యం చేస్తోంది, పైగా నేనే చెడ్డదాన్ని" ఉడుకుమోతుతనంతో బాధగా అంది హేమ.

"పెదనాన్నా చూడు! నా జడలెంత బావున్నాయో!" పేపరు చదువుకుంటున్న రామనాథం వొళ్ళో కూర్చుంటూ అంది రేణు.

"ఎంచక్కా వున్నావ్ రేణూ" ముద్దుపెట్టుకుని ఇంట్లోకెడుతున్న భార్య వైపు, కసిగ తన ధోరణి సాగిస్తున్న హేమవైపుచూస్తూ, ఆలోచిస్తూ అన్నాడు రామనాథం.

* * *

హేమ తన ఇంట్లో అడుగుపెట్టినప్పటినుండి ఇదేధోరణిలో చూస్తున్నాడామెను. అయినా, సుశీ ఒక్కరోజయినా, చెల్లెల్ని మందలించలేదు. "తనే చెప్పిచూశాడు ఎన్నోసార్లు, ఏమిటీ గోల వేరే పొమ్మని చెబుతాను" అని కాని సుశీ వొప్పుకోందే.

"పోనీండి" దాని స్వభావం అంతే అది పుట్టి పెరిగినప్పటినుంచీ చూస్తున్నాను, పిన్ని, నన్ను ఎంతో ప్రేమతో చూసింది. తల్లిలేని దాన్నని, మంచి సంబంధంచెయ్యాలని నాన్నతోపోరింది. పిన్నిమాట తోసెయ్యలేను, దాన్ని సరిదిద్దేభారం నీదేనని, మరీమరీ చెప్పింది అంటుంది." ఇంతకీ హేమని, సరిదిద్దినది ఏదీ? అక్క మెత్తతనంచూసి, మరీ రెచ్చిపోతోంది, కొంతమంది చిన్నపిల్లలు అల్లరిచేస్తారు; కాని ఇలా పెళ్ళయి, బిడ్డతల్లయినా, ఎదుటివారి మనసు తెలుసుకోలేనివాళ్ళని ఏమనుకోవాలి, సుశీ ఎంత చక్కగా చెబుతుందో, దాన్ని అంత పెడసరంగా అర్ధాలు తీస్తుంది. పోనీ, తనసొమ్ము మాకేమయినా పెడుతోందా! వాడికివచ్చేజీతం, ఆమె టాయిలెట్‌కే చాలవూ, తన సొమ్మే వారికీ సర్దుతున్నాడు. సత్యం కూడా, తనని స్వంత అన్నయ్యలా, ప్రేమగ చూచుకుంటాడు, చూస్తూ ఎలా వేరు పొమ్మనడం. అసలిప్పుడు మరో చిక్కువచ్చిందాయె! పిల్లలులేని సుశీ రేణు పుట్టినది మొదలు తనే తల్లిలా కాపాడుతోంది; బద్దకంతో అవలించే, హేమ, పిల్లని పెంచలేదని, రేణుబాధ్యతనంతా తనే తీసుకుంది, పిల్లలులేనిలోటు తీర్చిందనీ మురిసిపోతూవుంటుంది క్షణం విడిచి వుండలేనంటుంది ఎలా వేగడం. తనకీ రేణుని చూడందే! మనసు బావుండదు. పిల్లని దగ్గరకు తియ్యడంకూడా తప్పే అవుతున్నది, మాటలు నేర్చుకున్న పిల్ల నిజం మాట్లాడదా! అస్తమానం పెత్తల్లి కొంగుపట్టుకుని, అమ్మా ! అమ్మా ! అంటుంటే; చిన్నదానిలా ఉడుక్కోటం. చక్కగ బిడ్డని కాపాడుతోందనీ, తనకి సహాయంగా అక్క లేకపోతే, తనేం చెయ్యాలనే, సద్భావం లేనేలేదు, పెడర్థాలుతీసి మహాతెలివి వెలగపెడ్తున్నట్టు అథారటీ చూపిస్తూవుండే హేమ ప్రవర్తన ఎలా భరించడం చెప్మా! "దాని మనస్తత్వం లెండి" అంటుంది తేలికగ సుశీ. అర్ధం చేసుకోలేని మనస్తత్వాలు ఎందుకూ ; ఇంతకీ సుశీననాలి. మరీ అంత అలుసిస్తే ఎవరైనా అంతే ?

"నాన్నా! నాన్నా" వొళ్ళోనుండి ఎగిరిదుమికి ఇంటికొస్తున్న సత్యాన్ని చేరిన రేణుని చూసి నిల్చుంటూ ఆలోచనల ప్రవాహానికి అడ్డుకట్టవేశారు రామనాథం.

"అన్నయ్యా నన్ను కోయంబత్తూర్ మూడు నెలలు కోర్సుకి పొమ్మన్నారు నాలుగురోజులే టైమ్" అన్నాడు సత్యం.

"వెళ్లిరా సత్యం మనకు తెలిసిన ప్రదేశమేగా! హేమకి, రేణుకి భయ మేముంది మే మున్నాంగా "ఏమ్మా రేణూ, నాన్నతో పోతావా! అమ్మదగ్గరే వుంటావా" అన్నారు రేణుని బుజ్జగిస్తూ.

"ఊ నాన్నా కావాలి!అమ్మా కావాలి" అంది గారాంగా సుశీల గడ్డంపట్టుకుని ఊపుతూ రేణు.

"తప్పమ్మా నాన్న వూరెళ్లి ఇన్ని బొమ్మలూ, గౌన్లూ, తేవద్దూ! ఎంచక్కా ఆడుకోనీ ఏం సరేనా...రేణుతల నిమురుతూ అంది సుశీల.

ఏమో! నేనుండలేను బాబూ! ఈ మొండిఘటం నా దగ్గర వుండనంటుందాయె! మీరూ లేకుండా ఎలా మూడు నెలలు గడపడం అంది మూతి విరిస్తూ హేమ.

"నీకేం హేమా" చక్కగ మీ అక్కయ్యా నువ్వూ...సత్యం నవ్వుతూ అన్నాడు.

మీ రనేదేమిటో తెలియదనా! నే నంత జగడాలమారి నన్నమాట! అందరి ముందూ ఇలా చులకన చేసెయ్యండి, చిన్నది కూడా నన్ను తీసికట్టేస్తుంది, ఎందుకూ నేనూ వున్నాను......అరున్నొక్కక్క రాగంతీస్తూ అంది హేమ.

ఊరుకో హేమా "నే నలా అనలేదు నువ్వే అలా కల్పించుకుంటున్నావ్. చిన్నదాన్నంటావెందుకూ, ఎవరు దగ్గరకు చేరదీస్తే వాళ్ళ మంచనుకుంది. తప్పేముంది చెప్పు, ఎంతలో రావాలి మూడు నిముషాలులా అయిపోతాయి చూడు" అన్నాడు సత్యం హేమని ఊరడిస్తూ.

"అవున్లెండి! అన్నిటికీ ఆమే మంచిదీ నేను పనికిరానిదాన్నీను, మీరే ఆమెని అందలమెక్కిస్తుంటిరి, రేణు అనకేం చేస్తుందీ, అమ్మట, అమ్మట స్వరం హెచ్చిస్తూ అంది హేమ.

"హేమా"......గద్దిస్తూ అన్నాడు సత్యం, వదిన వింటుంది, మరొక మా రనకు! పాపం అమాయకురా లామె నీతో......అన్నాడు సత్యం బాధగ.

"ఏం వింటె భయమా! నేను వీళ్ల దగ్గర పడుండాలేమిటి మీరు లేకుండా! నాకేం గతిపట్టిందీ! అమ్మదగ్గరకు వెళ్లి పోతాలెండి మీ కెందుకూ మధ్యలో...

"ఛీ! నోర్ముయ్" కొంచె మయినా హృదయమనేదిలేదు సహిస్తున్నకొద్దీ...

అవునవును...వాళ్ళిద్దన్నీ మాట్లాడుకోనీ అనుకుంటూ వెళ్ళిన దంపతులిద్దరూ సత్యంకోపాన్ని, హేమ రాగాన్ని అర్థంచేసుకుని గదిలోకొచ్చారు మెల్లగా.

"సత్యం లేచిరా! ఎందుకలా కోప్పడతావు కొత్తయినట్టు ఆమే సర్దుకుంటుంది అన్నారు రామనాథం.

"ఊరుకో హేమా! శుభమా అని వెళ్తానంటే ఇదేమిటే! రా ముఖం కడుక్కుందువుకాని, సుశీల బ్రతిమాలుతూ అంది.

"నాసంగతి మీకెందుకూ నే నిప్పుడే వెళ్లిపోతాలే వూరికి" హేమ అంది లేస్తూ.

"అబ్బబ్బ" అన్నాడు సత్యం నిట్టూరుస్తూ.

"అలా విసుక్కోకు సత్యం! దానికి చిన్నతనంపోలేదు" సుశీల రేణుకి కాఫీ తాగిస్తూ అంది.

"బావుంది వరస" చిరునవ్వుతో లేచిపోయారు రామనాథం.

"నాన్నా! అమ్మ వూరికిపోతే! నే నిక్కలే వుంటా! మరి బొమ్మలు తెస్తావుగా అంది రేణు సత్యంజేబు సర్దుతూ.

"ఇక్కడే విడువు నిన్ను తీసుకెళ్ళి నే నెక్కడ భరించను" అంది హేమ కసిగా.

"చేతనయితే తీసికెళ్ళూ" వెక్కిరింపుగా అన్నాడు సత్యం.

"అదసలు రాదుగా అంది స్వరం తగ్గించి, మాతృత్వపుఛాయ చూపుతూ బాధగా.

"అలా చిన్నదానికీ పెద్దదానికీ భయపడతా వెందుకూ! చిన్న విషయాన్ని రాద్ధాంతంచేస్తావ్, మరి నువ్వు మారే దెప్పుడో" అన్నాడు దీనంగా చూసిన హేమముఖంచూసి కరిగిపోతూ సత్యం.

పెరట్లో రేణుకి పువ్వులు చూపుతూ ముసిముసిగా నవ్వింది సుశీల.

* * *

అలా వున్నావేం సుశీ!......

చేతిలో జాబుతీసి భర్తకందించింది సుశీల.

ప్రియమైన అక్కయ్యకు!

నేను క్షేమముగ యిల్లు చేరాను. రేణుని వదిలివచ్చానే గాని, మనసంతా దానిమీదేవుంది. దానిమెడలో 'నెక్లెస్' పెట్టివచ్చాను. జాగ్రత్తగ దాచిపెట్టవలసినది. అన్నట్టు చాకలి నా చీరలు తెచ్చాడనుకుంటాను. నా బీరువాలో పెట్టవలసినది. బావగారు నే లేనిదే సందడిలేదంటున్నారా! నీకూ తోచడం లేదనుకుంటాను. రేణూ వానలో తడుస్తుంది జాగ్రత్త. మీ మరది జాబు వ్రాశారు ఇంటికెళ్లమని. అమ్మా నాన్నా నిన్నడిగినట్లు చెప్పారు. రేణుకి నా ముద్దులు. అయినా నేనంటే దానికి కోపమేగా! నే లేకుంటేనే అందరికి హాయి, అవునా!

ఇట్లు,
హేమలత.

"నెక్లెస్" మెడలో పెడితే ఏమౌతుం దేమిటి! జాగ్రత్తట, చీరలు బీరువాలో పెట్టక ఏం చేస్తారేమిటి నీచబుద్ధసలు. ఆమె వస్తువులు ఎవరు తీస్తారసలు, అలా పాడు ఆలోచనలు ఆమెకే సరి. పిల్లమీద ఎంతప్రేమ, జాబులో నైనా, సౌమ్యతేమైనావుందా! వెధవగోల విను క్కుంటూ చదివిన జాబు భార్యపైన విసిరికొట్టూ అన్నారు రామనాథం.

"అది కాదండీ" దిగులుగా రేణును చూస్తూ అంది సుశీల.

"నాదండేమరే కనపల్లా పెదనాన్నా కళ్ళుత్రిప్పుతూ అంది రేణు.

పోతేపోయింది! మరోటి చేయిస్తేసరి దానికి భయమెందుకే జాలిగా చూస్తూ అన్నారాయన.

"అదలా వొప్పుకోదండీ" ఆలోచిస్తు అంది దీనంగా సుశీల.

*   *   *

పొద్దస్తమానం రేడియో వింటూ కూర్చోవటమేనా మగరాయుడులా వేళకు భోంచేసివెళ్లడం, బాగుందమ్మా నువ్వేమో చచ్చేట్టు బియ్యం ఏరుకోడం దగ్గర్నుంచి వడ్డించేవరకు చెయ్యటం. పోనీ, దానికి తెలియకపోతే నువ్వ యినా కేకలెయ్యకూడదూ, మరీ ఇంత గారాబమా ఏం! చిన్నపిల్లా ఏమన్నానా, ఓ బిడ్డతల్లయాక కూడా ఇలా అయితే ఎలా, రేపు మరోవూరు వెళ్ళిపోతారనుకో అప్పుడు ఇల్లంతా చక్క పెట్టుకోవాలంటే వళ్ళొంగుతుందీ, ఇంతకీ సుశీల మంచి దయితే, ఇదిలా చేస్తుందీ, సుశీలకు మాత్రం దీన్ని ఉద్ధరించాలనేంపట్టిందీ, పిల్లలులేనిది కనుక, రేణుకను చేర దీస్తోంది ఏమంటావ్ ఇలా హేమ ఉండి పోయిందంటే, ఇద్దరికి బాధేగా ? తల్లీ, కూతుళ్లను మందలింపు ధోరణిలో అంటోంది కామమ్మ.

సుశీల ననకు పిన్నీ! అది కనుక హేమని క్షమిస్తోంది కాని, మరొకరైతే అప్పుడే పంపేద్దురు, ఏదైనా మంచికి చెప్పినా, పైబడి పడంటుంది. అదేం చేస్తుంది పాపం! చిన్నప్పట్నించీ, దాని భావం అంతే పిన్నీ అంది వనమ్మ సిట్టూరుస్తూ.

*   *   *

రేడియోలో వచ్చిన నాటిక విని వికలమైన మనసుతో మెట్లుదిగుతున్న హేమకు అత్తయ్య, అమ్మలమాటలు వినిపించాయి. నన్నెవ్వరూ ఉద్ధరించ



నక్కరలేదులెండి! నా బ్రతుకెలావుందో అలా అవుతుంది నన్నిప్పటికెవరూ ఒక మాటనలేదు, నిన్న వచ్చిన వాళ్ళచేత పడాల్సొచ్చింది. ఇంతకీ ఒకర్ననడం ఎందుకూ. నన్నుచూస్తే అందరికీఅంతే! కోపంతో ఏడ్పుతో ప్రవాహంలా వస్తున్న వాగ్ధోరణిని...వనమ్మ భయంగా అడ బిడ్డనీ హేమనీ సర్దిందిమాటమార్చుతూ.

*   *   *

ఆమె ఎందుకు, తననలా అవమాన పరచాలి, అమ్మకూడా తనదే తప్పంది. నిజంగా తనదే తప్పా! అవును మరి! అక్క ఎంత మంచిది, తను ఎన్నన్నా ఏమీ అనదు. తనెందుకు వచ్చినట్టు యిక్కడికి. చక్కగా కబుర్లు చెప్పే రేణు అన్నిటినీ క్షమించే అక్క ఆ మల్లెలు ఎంత బావుంటుంది. వారు లేకుంటేనేం, ఇక్కడికొచ్చి ఏం సుఖం. వొంటరిగా రేడియోముందు కూర్చుని అమ్మకి తీరికే వుండదూ, ఎంతచక్కని నాటిక, అచ్చం తనకదే ఆపాత్రే తనని ఛీ ఛీ ఇతరుల నొప్పించే ప్రవర్తనగా నడుచుకొనడం తప్పేగా బుద్దొచ్చింది.

దాని స్వభావం అంతే! సుశీలక్క మాటలు తారుమారుకావాలి. అమ్మతో చెప్పి రేపే ప్రయాణంకావాలి. జాబు చూచి అక్క ఎలా బాధపడిందో కసిగా వ్రాసింది అబద్ధాలన్నీ కూర్చి. తప్పంతా తనదే. హేమ ఏడుస్తూ ఆలోచించింది ప్రయాణ సన్నాహం అవుతూ.

*   *   *

అమ్మా, అమ్మా రేణు పరుగెత్తుకుని వచ్చింది. హేమ ప్రేమగా హృదయాని కద్దుకుంటూ ఇంట్లో కడుగుపెట్టింది

'ఉన్నట్టుండి ఊడిపడ్డావేమే' అంటున్న సుశీలమాటకు సమాధానంగా సౌమ్యముగా చూసి.

మూడు నెలలు ఎలా వుండనూ అన్నావ్ నిముషాల్లా రాలేదూ అన్నాడు సత్యం హేమని చూస్తూ.

మంచిరోజులు మరింత త్వరగా వెళ్లిపోతాయ్‌గా అంది హేమ. సత్యం అర్థంకానట్టు చూశాడు. రేణు వాళ్ళిద్దరి సంభాషణ చాలన్నట్టు కబుర్లు చెబుతూ కూర్చుంది మధ్య.

* * *

రామనాథంగారు సత్యం మాట్లాడుతూ నడుస్తున్నారు రోడ్డులో విశేషాలేంటి సత్యం...

కాలేజీ స్టూడెంటులా మూడు నెలలూ గడిపాను. ఇంతకీ ఇక్కడి సంగతులు చెప్పనేలేదు...

ఏమున్నాయి నువ్వెళ్లగానే హేమ ఊరికెళ్లింది. రేణుతో మాకుబాగానేసందడిగా వున్నాము. హేమ ఓ చిన్నతమాషాగా ఉత్తరం వ్రాసింది. నెక్లెస్ రేణుకి పెట్టివచ్చానని, పాపం మీ వదిన ఎలా పోయిందో అని చాలా భయపడింది కాని, హేమవచ్చి నిజం చెప్పేసింది నవ్వుతూ—ఏమైందో తెలియదు కాని సత్యం, హేమ చాలా మారిందోయ్ అన్నారు రామనాథం. అన్నయ్య మాటలు వింటున్న సత్యం ముఖంలో భావాలు మారినా, పైకి ఏమీ అనలేక మీ అభిమానం కాని, హేమ మారేదేమిటి అన్నయ్యా అన్నాడు బాధతో కూడిన స్వరంతో. ఇద్దరూ ఎవరిపని మీదవారు విడిపోయారు.

* * *

భర్తరాక హేమ సంతోషానికి కారణమై తమ గదిని, శుభ్రపరుస్తూంది ఆనందంతో. ఇకమీదట తనెంత సాధుస్వభావంతో ప్రవర్తించవలసినదీ, చక్కగ ఆలోచిస్తున్న హేమకు అదుర్దాగా అవేశంతో గదిలో అడుగుపెడుతున్న సత్యం కనిపించాడు. ఏమండీ! అలా అవేశపడుతున్నారేం? అంది హేమ ప్రశ్నార్థకంగా.

"నీలాంటిదాన్ని పెళ్లిచేసుకున్నాక ఆవేశంకాక మరేముంటుంది. ఇంట్లో ఎలాగో నీ గయ్యాళితనానికి, సరిదిద్దుకుంటూంటే నలుగురిలో నా పరువూ మర్యాదా మంటగలిపేస్తున్నావ్, మనిషి వయినతరువాత, అర్థం చేసుకోలేవా! మీ అక్కయ్య వుంది కాని, లేకుంటే ఇప్పటికి నన్నో సన్యాసిగా చేసివుండేదానివి. ఛీ! ఛీ!! బ్రతుకంతా అధ్వాన్నమే నీతో ... నిప్పులు చెరుగుతున్న భర్తముఖాన్ని అర్థంచేసుకోలేక చిఱునవ్వుతెచ్చిపెట్టుకుని 'ఇంతకీ మీ రనేదేమిటంటారు అంది శాంతవదనంతోనే హేమ.

"ఏముఖంతో అడుగుతున్నావ్ చెప్పమన్నట్టు మీమామయ్యాలేడూ...అర్థం కానట్లుందే! మీ నాన్నగారి బావేనా! మీ అత్తయ్య ... ఆయన నడిరోడ్డులో నిలేసి, మీ అత్తయ్యని నానా మాటలు అన్నావట, తమ్ముడిల్లుకదా అని పంపాడట ఆమెను. నువ్వున్నావని తెలియదట. మనగడపత్రొక్కడట ఇక ఇంతకీ అతన్నని ప్రయోజనంలేదు, నీలాంటి దానివి అడగవని ఎలా అనుకోను. అన్నయ్య కనుక, అబద్దాలురాసినా, నీ నోటికి భయపడి, మరో నెక్లెస్‌చేయించి పెట్టాడు అందరూ అలా వుంటారా! ఛీ ఛీ నా అదృష్టం కర్మ... ...సత్యం తలబాదుకుంటూకూలబడ్డాడుకుర్చీలో. 'ఏమిటీ సత్యం శుభమా అని యిల్లు చేరి అదృష్టం కర్మ అంటున్నావే'అంది సుశీల వెక్కి వెక్కి ఏడుస్తున్న హేమని సమీపిస్తూ.

"ఊరుకో హేమా అలా చిన్నపిల్లలా ఏడవుతున్నావ్! ఎప్పుడూ మంచిలోనే కష్టాలుంటాయి, ఒకసారి తప్పుచేసామంటే, రెండోసారి చెయ్యకున్నా అనుమానపడ్తారు. చూడు నువ్విప్పుడు చాలా మారిపోయావ్ కాని, ఇదివరకు తప్పుచేశావ్ కనుక, అనుమానం నిన్నే నిందించింది. ఎప్పుడూ అంతే ఒకసారి పొరపాటుచేసేవంటే రెండోసారి మరొకరుచేసినా అది నీ పొరపాటేనని భావిస్తారు. ఇలాంటి చిక్కులు విడిపోవాలంటే ఓర్పు తప్ప మరోమార్గం లేదు. సత్యంకూడా పొరపడ్డాడు కాని, ఏనాడైనా నిన్ను మందలించాడా? మరిది చాలా మంచివాడు చూడు వాళ్ళ అన్నయ్యతో ఎలా దీనంగా చెబుతున్నాడో, సుశీల చెల్లెల్ని సముదాయిస్తూ అంది బ్రతిమాలుతున్నట్లు.

"పొరపాటు"పడ్డావ్ సత్యం అనే రామనాథంమాటలు అక్కచెల్లెళ్లకుఅధికారపూర్వకంగా వినిపించాయి.

"నన్ను క్షమిస్తావా అక్కా" అన్న మాటలు అన్నా తమ్ముళ్లకు గాద్గధికంగా వినిపిస్తున్నాయి.

★

## కాలు ఆణి మందు

కాళ్లలో యేర్పడు అణికి యీ దివ్యమైన ఔషధమును ప్రతిరోజు పైన చరుముకొని వచ్చినచో అణియొక్క మొలకను బయటికి తీసివైచి స్వస్థపరచును. మరల యెప్పటికిని కాలిలో అణి రానేరదు. బాగుగ మామూలు ప్రకారము పాదములు అణచి నడచుటకు వీలుపడును.

బుడ్డి 1-8 రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్ పెట్టె నెం. 1376, మదరాసు-1.